క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్‌కు వినతి



లక్సెట్టిపేట: వినతిపత్రం ఇస్తున్న వీఓఏలు

లక్సెట్టిపేట: మండలంలోని ఐకేపీ వీవోఏల సమస్యలు పరిష్కరించాలని సోమవారం తహసీల్దార్ జ్యోత్స్నకు వినతిపత్రం అందించారు. కనీస వేతనం పెంచాలని, ఇన్సూరెన్సు అందించాలని, ప్రమాదబీమా కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించా రు. కార్యక్రమంలో వీఓఏ సంఘం నాయకులు లింగంపల్లి వెంకటేశ్, రమేశ్, కళావతి, శారద, అనిత, లచ్చన్న, చంద్రయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జీవో ప్రకారం బిల్లులు చెల్లించండి



సీడీపీవో మనోరమకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

చెన్నూర్: ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాల ఇంటి అద్దె, గ్యాస్ బిల్లులు చెల్లించాలని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకురాలు రమాదేవి అన్నారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీడీపీవో మనోరమకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెల ప్రాజెక్ట్ సమావేశం నిర్వహించాలన్నారు. ప్రాజెక్ట్ సమావేశాలు నిర్వహించకపోవడంతో అంగన్‌వాడీ టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లలేక పోతున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో చెన్నూర్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు శారద, నాయకురాళ్లు రాజేశ్వరి, మంగ, మహతి పాల్గొన్నారు.

రేషన్ షాపు ఏర్పాటు చేయాలని వినతి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సంజీవ్

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని 24వ వార్డులో ప్రభుత్వ చౌకధరల దుకాణాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ఆ వార్డు కౌన్సిలర్ వేములపల్లి సంజీవ్ సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌కు, కలెక్టరేట్ ఏవో సురేశ్, మంచిర్యాల తహసీల్దార్ రాజేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ మాట్లాడుతూ 2,437మంది ఓటర్లు 3వేలకు పైగా జనాభా కలిగిన వార్డులో రేషన్‌షాపు లేకపోవడంతో 500మందికి పైగా లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దూరభారం తగ్గించి, లబ్ధిదారులకు వార్డులోనే రేషన్ షాపును ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు హుండీ ఆదాయం లెక్కింపు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కత్తెరసాల గ్రామంలోని శ్రీ మల్లిఖార్జునస్వామి ఆలయంలో మంగళవారం లెక్కింపు జరుగుతుందని ఆలయ ఈవో ముక్త రవి తెలిపారు. మహా శివరాత్రి సందర్భంగా భక్తులు హుండీలో వేసిన కానుకలు, టిక్కెట్ల ఆదాయం, హుండీ లెక్కింపు ఉదయం 10:30గంటలకు ఆలయ ఆవరణలో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

బీమాతో కార్మికులకు ధీమా



ఇన్సూరెన్స్ పత్రాలతో భవన నిర్మాణ కార్మికులు

బెల్లంపల్లి: భవన నిర్మాణరంగంలో పని చేస్తున్న తాపీ కార్మికులకు బీమా వల్ల ఎంతగానో ప్రయోజనం ఉంటుందని బెల్లంపల్లి సహాయ కార్మికాధికారి సుకన్య అన్నారు. తాపీ సంఘ భవనంలో సోమవారం భవన నిర్మాణ కార్మికులకు ఇన్సూరెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భవన నిర్మాణరంగంలో పని చేస్తున్న కార్మికుల సంక్షేమానికి కార్మికశాఖ తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. తాపీ కార్మికులు ఇన్సూరెన్స్ చేయించుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. ప్రతి కార్మికుడు విధిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని వివరించారు. అనంతరం 150మంది భవన నిర్మాణ కార్మికులకు ఇన్సూరెన్స్ చేయించారు.

పల్లె దవాఖానాలకు సుస్తీ..!



నెల్కివెంకటాపూర్‌లో పూర్తైన ఆరోగ్య ఉపకేంద్రం



రెబ్బనపల్లిలో నిర్మాణంలో ఆరోగ్య ఉపకేంద్ర భవనం

- నత్తనడకన సాగుతున్న ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

దండేపల్లి: పల్లెప్రజలకు వైద్యసేవలు అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆరోగ్య ఉపకేంద్రాలు (పల్లె దవఖానాలు) ఏర్పాటు చేసింది. దండేపల్లి మండలంలోని నెల్కివెంకటాపూర్, రెబ్బనపల్లి, కొర్విచెల్మ గ్రామాల్లో గల ఉపకేంద్రాలకు పక్కా భవనాలు లేక అద్దె ఇళ్లలో, ప్రభుత్వ పాఠశాలల ఆవరణల్లో నిర్వహిస్తున్నారు. దీంతో వీటికి పక్కా భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం 2018లో ఒక్కో ఉపకేంద్ర భవనానికి రూ.14లక్షలు నిధులు మంజూరు చేసింది. అప్పటి నుంచి ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణం పనులు సాగుతూనే ఉన్నాయి. దీంతో ఆరోగ్య ఉపకేంద్రాలకు పక్కా భవనాలు లేక అరకొర వసతుల నడుమ నిర్వహిస్తున్నారు. అందులో నెల్కివెంకటాపూర్ ఆరోగ్య ఉపకేంద్ర భవనం పనులు పూర్తికాగా, రెబ్బనపల్లి, కొర్విచెల్మ ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణాలు చివరి దశలో ఉన్నాయి. నిర్మాణానికి ఏళ్లు గడవడంతో, ఇక ప్రారంభానికి ఎన్నేండ్లు పడుతుందో అని పలువురు చర్చించుకుంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతోనే పనులు నత్తనడకన సాగాయన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి, నిర్మాణాలు పూర్తయిన ఆరోగ్య ఉపకేంద్రాలను త్వరగా ప్రారంభించి, ప్రజలకు వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఐటీడీఏ ఏఈఈ రాజేశ్వర్‌ను సంప్రదించగా, మూడింటిలో ఒక దాని పనులు పూర్తయ్యాయి. మిగిలిన రెండింటి పనులు చివరి దశలో ఉన్నాయన్నారు. వాటి పనులు కూడా త్వరగా పూర్తిచేస్తామని చెప్పారు.

ఐదేళ్లుగా నిర్మాణం



రెబ్బనపల్లి ఆరోగ్య ఉపకేంద్రానికి పక్కా భవనం లేక అద్దె ఇంట్లో నిర్వహిస్తున్నారు. దీంతో రోగులు ఇబ్బందికి గురవుతున్నారు. ఆరోగ్య ఉపకేంద్ర పక్కా భవనానికి ఐదేళ్ల క్రితం నిధులు మంజూరైనా ప నులు పూర్తి కావడానికి ఐదేళ్లు పట్టింది. మిగిలిన కొద్దిపాటి పనులు త్వరగా పూర్తిచేయాలి.

– బత్తుల మౌనిక, ఎంపీటీసీ, రెబ్బనపల్లి

త్వరగా ప్రారంభించాలి



నెల్కివెంకటాపూర్ ఆరోగ్య ఉపకేంద్రానికి పక్కా భవనం లేదు. కొద్ది రోజులు అద్దె ఇంట్లో నిర్వహించారు. కరోనా సమయంలో అద్దె ఇల్లు ఖాళీ చేయడంతో, స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నారు. ఉపకేంద్రం పక్కా భవనం పనులు పూర్తయినందునా త్వరగా ప్రారంభించి, ప్రజలకు అందుబాటులోకి తేవాలి.

– పిట్టల తిరుపతి, నెల్కివెంకటాపూర్

పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

నెన్నెల: మండలంలోని పలు గ్రామాల్లో రూ.2.30కోట్ల ఈజీఎస్ నిధులతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సోమవారం భూమిపూజ చేశారు. పల్లెల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గల్లీ, గల్లీకి రోడ్ల నిర్మాణం చేపట్టిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. అనంతరం నెన్నెల బోయవాడలో లివర్ క్యాన్సర్‌తో బాధపడుతున్న తుత్తుర్ల లక్ష్మి, పక్షవాతంతో మంచానికే పరిమితమైన తుత్తుర్ల రాజం దంపతుల కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. నెలానెలా ఖర్చుల కోసం ఆర్థికసాయం చేసి కుటుంబాన్ని ఆదుకుంటానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ శ్యామల, పీఏసీఎస్ చైర్మన్ మల్లేష్, వైస్ ఎంపీపీ సుమలత, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సాగర్‌గౌడ్, కో ఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, నెన్నెల ఎంపీటీసీ తిరుపతి పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి

బెల్లంపల్లి: ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకుని కంటి చూపును మెరుగు పర్చుకోవాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మండలంలోని బుధాకుర్దు గ్రామంలో సోమవారం కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించి కంటి వెలుగు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అనంతరం రూ.20లక్షలు, లింగాపూర్‌లో రూ.65లక్షల అంచనాతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, ఎంపీపీ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ రాణి, సర్పంచ్‌లు వేముల కృష్ణమూర్తి, వెంకటేష్, ఎంపీడీవో రాజేందర్, ఎంపీటీసీ సుభాష్‌రావు, బెల్లంపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

దృష్టి లోపాల నివారణకు 'కంటి వెలుగు'



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కోటపల్లి: దృష్టి లోపాల నివారణకు కంటివెలుగు ఉపయోగపడుతుందని ఎంపీపీ మంత్రి సురేఖ అన్నారు. మండలంలోని రొయ్యలపల్లిలో సోమవారం కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీ కో ఆప్షన్ అజ్గర్, సర్పంచ్ నిర్మల, పీఏసీఎస్ చైర్మన్ సాంబగౌడ్, మండల అధ్యక్షుడు ఓదెలు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శేషుపల్లిలో మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, మేనేజర్ నాగరాజు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని సోమనపల్లిలో ఎంపీపీ మంత్రి బాపు, జెడ్పీటీసీ మోతె తిరుపతి ప్రారంభించారు.

చెన్నూర్: స్థానిక 8వ వార్డు పరిధిలోని సాయిరాం ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనా రాంలాల్ గిల్డా ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, కౌన్సిలర్ జోడు శంకర్, వైద్యులు బాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

'బీఆర్ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పాలి'



రామకృష్ణాపూర్: మాట్లాడుతున్న శ్రీనివాస్

రామకృష్ణాపూర్: రాష్ట్రంలో అవినీతి పాలన సాగిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు మహంకాళి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని 76, 77, 78బూత్‌ల్లో సోమవారం ప్రజాగోస-బీజేపీ భరోసా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల హామీలను నెరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజలను వంచించిన బీఆర్ఎస్‌ను ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జి జంగంపెల్లి మల్లయ్య, ఆరుముళ్ల పోషం, పత్తి శ్రీనివాస్, సత్యనారాయణ, వైద్య శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేటలో బీజేపీ ఆధ్వర్యంలో 'ప్రజాగోస–బీజేపీ భరోసా'లో భాగంగా స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వెంకటేశ్వర్‌గౌడ్ హాజరై మాట్లాడారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు బాపు, ప్రధాన కార్యదర్శి రాజేష్, రఘునందన్‌రెడ్డి, శక్తి కేంద్రం ఇన్‌చార్జి శంకర్, బూత్ అధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు శ్రావణ్‌రెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

24న జాబ్‌మేళా

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఉపాధికల్పన కార్యాలయంలో ఈ నెల 24న శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారి కౌశిక వెంకటమరణ ఒక ప్రకటనలో తెలిపారు. సుస్థిర ఇన్‌ఫ్రా ప్రాజెక్టు కంపెనీలో మార్కెటింగ్ మేనేజర్లు(10), మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్(30) ఉద్యోగాల కోసం ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, ఎంబీఏ, బీటెక్ విద్యార్హతలు కలిగిన నిరుద్యోగులు తమ అర్హత ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. అభ్యర్థుల వయస్సు 18–28ఏళ్ల లోపు వయస్సు ఉన్న పురుష అభ్యర్థులు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని, ఈ ఉద్యోగాల కోసం ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం'



నస్పూర్: కాంగ్రెస్ పార్టీతోనే పట్టణ అభివృద్ధి సాధ్యమని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్రలో భాగంగా ఆమె పట్టణంలోని 11వ వార్డులో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులోని ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పేద ప్రజలను ఆదుకోవడం కోసం తాము కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఖలీద్, రూస్సీ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని 2వ వార్డులో రూ.10లక్షల మున్సిపల్ జనరల్ ఫండ్‌తో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు సోమవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వార్డు కౌన్సిలర్ సల్ల మహేశ్, 24వ వార్డు కౌన్సిలర్ సంజీవ్, పోరెడ్డి రాజు, కాంగ్రెస్ నాయకులు శ్రీరాముల తిరుపతి, సారంగుల శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రజావాణిని సందర్శించిన ట్రెయినీ కలెక్టర్



ప్రజావాణిపై ఆరా తీస్తున్న శిక్షణ కలెక్టర్ గౌతమి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల విభాగాన్ని సోమవారం ట్రెయినీ కలెక్టర్ గౌతమి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి ఫిర్యాదుల గురించి వివరంగా తెలుకుని ఫిర్యాదుల విభాగానికి వస్తున్న ప్రజా సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏఏ విభాగాల నుంచి ఎలాంటి సమస్యలపై ఎక్కువగా అర్జీలు వస్తాయని, ప్రజల నుంచి వస్తున్న దరఖాస్తులను ఏ విధంగా పరిష్కరిస్తున్నారని తెలుసుకున్నారు. మండల ప్రత్యేకాధికారి రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ రాజలింగు, ఎంపీడీవో అబ్దుల్‌హై, ఎంపీవో శ్రీనివాసరెడ్డి, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, మండల వ్యవసాయాధికారి మార్గం రజిత ఫిర్యాదుల విభాగంలో పాల్గొన్నారు. శిక్షణ కలెక్టర్ గౌతమి దృష్టికి ఒకే ఒక్క ఫిర్యాదు రావడం గమనార్హం.

'మైనింగ్ స్టాఫ్‌పై చర్యలు సరికాదు'



బెల్లంపల్లి: నిరసన తెలుపుతున్న నాయకులు

బెల్లంపల్లి: భూపాలపల్లి ఏరియాలో మైనింగ్ స్టాఫ్‌పై సింగరేణి యాజమాన్యం చర్యలు తీసుకోవడం సరైంది కాదని సింగరేణి కాలరీస్‌వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ అన్నారు. శాంతిఖని గనిపై సోమవారం జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. కేటీకే 8ఇంక్‌లైన్ గనిలో జరిగిన ప్రమాదాన్ని సాకుగా చూపి యాజమాన్యం మైనింగ్ స్టాఫ్‌పై క్రమ శిక్షణ చర్యలకు సిద్ధపడటం సబబు కాదన్నారు. మైనింగ్ మిత్రుడు ప్రకాష్‌ను డిస్మిసల్ చేయడానికి యాజమాన్యం నిర్ణయం తీసుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. యాజమాన్య చర్యలను నిరసిస్తూ, భవిష్యత్ పోరాటాలను మరింత తీవ్రతరం చేయడానికి ఈ నెల 27న కొత్తగూడెంలో సింగరేణి హెడ్ ఆఫీసును ముట్టడి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు చిప్ప నర్సయ్య, వంగరి రాజేశ్వరరావు, సత్యనారాయణ, వెంకటస్వామి, తిరుపతి గౌడ్, ప్రశాంత్, అశోక్, శ్రీకాంత్, అమీర్ ఖాన్, కమలాకర్, వెంకటేష్, నాగయ్య, రమేష్, జావెద్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: సింగరేణిలోని భూపాలపల్లి ఏరియాలో ఉద్యోగులను యాజమాన్యం డిస్మిస్ చేసిందని, ఇది అన్యాయమని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పేర్కొన్నారు. ఏరియాలోని గనులు, డిపార్ట్‌మెంట్‌లలో సోమవారం సమావేశాలు నిర్వహించి డిస్మిస్ చేసిన ఉద్యోగులను తిరిగి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అధికారులకు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో రాజిరెడ్డి, సుదర్శన్, జాఫర్, సురేందర్, దేవి సత్యం, మణిరాంసింగ్ తదితరులు ఉన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

విద్యార్థులకు పోటీలు

శ్రీరాంపూర్: అజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా సోమవారం సీసీసీలోని సింగరేణి ఉన్నత పాఠశాల విద్యార్థులకు పెయింటింగ్‌లో పోటీలు నిర్వహించారు. పాఠశాల వద్ద జరిగిన పోటీల్లో విద్యార్థులకు 'దేశ భక్తి' అనే అంశంపై పెయింట్ పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాధాకృష్ణ, ఉపాధ్యాయులు లింగయ్య పాల్గొన్నారు.

సంతాపం

రామకృష్ణాపూర్: ఊపిరితిత్తులు చెడిపోయి ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందిన పట్టణంలోని జ్యోతినగర్‌కు చెందిన డాన్స్‌మాష్టర్, ప్రజానాట్య మండలి కళాకారుడు చొప్పదండి దుర్గాకు ఆయా పార్టీల నాయకులు సోమవారం సంతాపం తెలిపారు. ఏఐటీయూసీ నేత సీతారామయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి శ్రీనివాస్ హాజరై నివాళులర్పించారు. సింగరేణి వైద్యుడు రాజరమేష్ దుర్గా అంత్యక్రియల కోసం ఆర్థిక సాయం అందించారు.

సమస్యల పరిష్కారానికే 'ప్రజావాణి'

- బెల్లంపల్లి ఆర్డీవో శ్యామలాదేవి



ప్రజావాణిలో పాల్గొన్న బెల్లంపల్లి ఆర్డీవో



మందమర్రిరూరల్: వినతిపత్రం ఇస్తున్న నర్సింగ్

నెన్నెల: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులకు సంబంధించిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని బెల్లంపల్లి ఆర్డీవో శ్యామలాదేవి అధికారులకు సూచించారు. నెన్నెల మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో భూ సమస్యలకు సంబంధించిన మూడు అర్జీలు రాగా దరఖాస్తులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భూమేశ్వర్, ఎంపీడీవో వరలక్ష్మి, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో నరేష్, ఏపీఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

మరమ్మతు చేయాలని వినతి

మందమర్రిరూరల్: మండలంలోని వెంకటాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని లేమూరు చెరువు రెండు కాలువలకు మరమ్మతు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పైడిమల్ల నర్సింగ్ మండల ప్రత్యేకాధికారి, సీపీవో సత్యంకు వినతిపత్రం అందించారు. ఆయకట్టు భూమికి సరిగా నీరందక రైతులు ఇబ్బంది పడుతున్నారని మండిపడ్డారు. ఆయన వెంట నాయకులు వెంకటేశ్

ఫిర్యాదులు నిల్

వేమనపల్లి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో లక్ష్మయ్య అధ్యక్షతన ప్రజావాణి నిర్వహించగా ఒక్క దరఖాస్తు రాలేదు.

భీమారం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఎలాంటి దరఖాస్తులు రాలేదు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు, సమస్యలపై ప్రజావాణిలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వాసంతి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా స్పందన కరువయ్యింది. ఒక్క ఫిర్యాదు కూడా రాలేదు. మండల ప్రత్యేకాధికారి కృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్, ఈజీఎస్ ఏపీవో గంగాభవాని, ఐకేపీ ఏపీఎం ప్రమీల, అధికారులు పాల్గొన్నారు.



భీమారంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్



వేమనపల్లి: మాట్లాడుతున్న ఎంపీడీవో



చెన్నూర్‌రూరల్: పాల్గొన్న అధికారులు

ఘనంగా స్పోర్ట్స్ కార్నివల్

రామకృష్ణాపూర్: గద్దెరాగిడిలోని గ్రీన్‌వుడ్ పాఠశాలలో సోమవారం స్పోర్ట్స్ కార్నివల్‌ను మండల విద్యాధికారి జాడి పోచయ్య ప్రారంభించారు. వార్షిక క్రీడా పోటీల్లో భాగంగా మూడు రోజుల పాటు వివిధ క్రీడాంశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అయూబ్ తెలిపారు.

రోడ్లకు మరమ్మతు చేయండి

పాతమంచిర్యాల: జిల్లాలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని మరమ్మతు నిర్వహించాలని వైస్సార్‌టీపీ యువజన విభాగం అధ్యక్షుడు షేక్ అజిమొద్దిన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుద్దాల ప్రభు, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ఓరం రవి, నాయకులు రాజ్, రమేష్, సతీష్ పాల్గొన్నారు.

ట్రేడింగ్ లైసెన్స్‌లు పొందాలి

భీమారం: మండల కేంద్రంలో వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యాపారస్తులు ట్రేడింగ్ లైసెన్స్‌లు

సంక్షిప్త వార్తలు

పొందాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ కోరారు. లేకపోతే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత సంవత్సరం పొందిన వారు, ఈ సారి రినీవల్ చేసుకోవాలని ఆయన కోరారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

కాసిపేట: ప్రస్తుతం వరి పంటలో కాండం తొలిచే పురుగు ఎక్కువగా ఉన్నందునా రైతులు అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని బెల్లంపల్లి ఏడీఏ సురేఖ సూచించారు. కాసిపేట మండలంలో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో దేవాపూర్‌లో ఎంపిక చేసిన 20 సర్వే నంబర్‌లో వేసిన పంటలను పరిశీలించారు.

అధ్యక్షుడిగా మతీన్‌ఖాన్

మందమర్రిరూరల్: పట్టణంలోని బీఎంఎస్ కార్యాలయంలో సోమవారం బీజేపీ అనుబంధ మైనార్టీ మోర్చా మందమర్రి పట్టణ అధ్యక్షుడిగా మహమ్మద్ మతీన్‌ఖాన్‌ను ఎన్నుకున్నట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు సప్పిడి నరేష్ తెలిపారు.

అవగాహన

కాసిపేట: మండల కేంద్రంలో పోస్టల్ పొదుపు ఖాతాలపై సోమవారం అవగాహన కల్పించారు. 30మంది ఖాతాలు తెరిపించినట్లు సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో బెల్లంపల్లి సబ్ డివిజనల్ మేయిన్ ఓవర్సీస్ తాజోద్దీన్, బ్రాంచి పోస్టుమాస్టర్ భూమన్న పాల్గొన్నారు.